మొబైల్ ఫోన్ల వాడకం పిల్లలకు వ్యసనంలాంటిది

-బాగేశ్వర్‌ధామ్ బాలాజీ ఆలయ ప్రధానపూజారి బాగేశ్వర్ సర్కార్

మేడ్చల్, జులై 18. ప్రభాతవార్త:

మొబైల్ ఫోన్ల వ్యసనం పిల్లలపై తీవ్ర ప్రభావాలను చూపుతుందని, దీని ప్రభావంతో విద్యార్థుల సృజనాత్మకత, ఆలోచనాశక్తి తగ్గిపోతాయని బాగేశ్వర్‌ధామ్ బాలాజీ ఆలయ ప్రధానపూజారి, ఆధ్యాత్మిక నాయకుడు పూజ్యశ్రీ బాగేశ్వర్ సర్కార్ తెలిపారు. గుండ్లపోచంపల్లి డివిజన్‌లోని డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం విద్యార్థులతో ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన ప్రసంగిస్తూ విద్యార్థులతో ఆధ్యాత్మిక సమావేశాలు నిర్వహించడంతో వారిలో నైతిక విలువలు, మానసిక ప్రశాంతతతో పాటు ఏకాగ్రతను పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. మొబైల్ ఫోన్లు, ఇంస్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లకు దూరంగా ఉంటేనే ఏదైనాసాధించగలమని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ దయానంద్ అగర్వాల్, డైరెక్టర్లు సంజయ్‌కుమార్ అగర్వాల్, అంజనీకుమార్ అగర్వాల్, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే ఓ ల్యాండ్ గ్రాబర్

-నందిగామ పోలీస్ స్టేషన్లో ..బిఆర్ఎస్ నేత కార్తీక్‌రెడ్డి ధ్వజం

నందిగామ, జులై 18, ప్రభాతవార్త:

ప్రభుత్వమే ల్యాండ్ గ్రాబరని, తరతరాలనుండి భూమిని అనుభవిస్తున్న పేద రైతులపై విరుచుకుపడి వారి హక్కులను కాలరాయడం అన్యాయమని చేవెళ్ల బిఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. శంషాబాద్ మండలం బహదరగూడలో వివాదాస్పద భూవ్యవహారంలో నిరుపేద రైతులకు మద్దతుగా నిలిచిన కార్తీక్‌రెడ్డిని పోలీస్ అరెస్ట్‌చేసి నందిగామ పోలీస్ స్టేషన్లో పెట్టారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ బహదూర్‌గూడ భూముల్లో తరతరాలుగా నిరుపేదలు అనుభవిస్తున్నారని, ఆ భూమిపై కోర్టు స్టే విధించినా వేలాదిమంది పోలీసులను పెట్టి నిరుపేదలపై విరుచుకుపడి, వారి హక్కులను కాలరాసి అరెస్ట్‌చేయడం దుర్మార్గమన్నారు. కార్తీక్‌రెడ్డి అరెస్ట్‌కాబడి నందిగామ పోలీస్ స్టేషన్లో ఉన్నాడనే సమాచారం తెలిసిన స్థానిక బిఆర్ఎస్ నేతలు వంకాయల నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ జిల్లెల్ల వెంకట్‌రెడ్డి, రాజావరప్రసాద్, రాంబల్‌నాయక్‌లు మద్దతు పలికారు.

బహదూర్‌గూడలో ఉద్రిక్తత

-హైడ్రా అధికారుల ఎంట్రీతో రైతుల ఆందోళన
-పోలీసులు, రైతులు, నాయకులు మధ్య తోపులాటలు, అరెస్టులు
-పోలీసుల కళ్లలో కారంచల్లిన రైతులు
-ఉద్రిక్తత వాతావరణంలో కొనసాగిన ఫెన్సింగ్ పనులు

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జులై 18, ప్రభాతవార్త:

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో హైడ్రా అధికారులు భారీగా చేరుకోవడంతో తీవ్ర ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయి. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకోసం భూములస్వాధీనానికి అధికారులు చర్యలు చేపడుతుండగా, రైతులు మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిరసనలు కొనసాగిస్తున్నారు. తమకు స్పష్టమైన హామీలు, సరైన పరిహారం ప్రకటించిన తర్వాతే భూములు అప్పగిస్తామని రైతులు తేల్చిచెప్పడమే కాకుండా ఆరు రోజులుగా నిరవధిక ఆందోళనచేస్తున్నారు. శనివారం ఉదయం హైడ్రా అధికారులరాకతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దీంతో రైతులు, పోలీసులమధ్య కొద్దిసేపు తోపులాట చోటుచేసుకోగా పలువురు రైతులను అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. అయినా రైతులు ఆందోళన కొనసాగించారు.

650 ఎకరాల స్వాధీనానికి చర్యలు...

బహదూర్‌గూడ గ్రామంలోని 650 ఎకరాల ప్రభుత్వభూమిని స్వాధీనం చేసుకునేందుకు హైడ్రా, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. అయితే గ్రామంలోని సర్వేనెంబర్ 28లో 150 ఎకరాలు, సర్వేనెంబర్ 62లో 500ఎకరాలు మొత్తం 650 ఎకరాలకు సంబంధించిన భూమిపై ప్రభుత్వానికి, రైతులకు మధ్య వివాదం నెలకొని సంవత్సరాలుగా నడుస్తోంది. ఈ క్రమంలో 650 ఎకరాలను స్వాధీనం చేసుకునేందుకు రాజేంద్ర నగర్ ఆర్డీఓ హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ రంగనాథ్ ఆదేశాలమేరకు బహదూర్‌గూడగ్రామానికి అధికారులు చేరుకోగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్డీవో శ్రీధర్ అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి 500గజాల స్థలాన్ని సాగుచేసుకోవాడానికి ఇస్తామని హామీ ఇచ్చినా, రైతులు వినకపోవడంతో భారీ పోలీసుబందోబస్తు మధ్య ఫెన్సింగ్ పనులు కొనసాగించారు. మద్దతు తెలిపేందుకు వచ్చిన బిజెపి జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్‌గౌడ్, బిఆర్ఎస్ నేతలను అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు.

పోలీసుల కళ్లల్లో కారంచల్లిన రైతులు...

బహదూర్‌గూడలో అవాంఛనీయ ఘటన చోటు చేసుకోకుండా బందోబస్తుగా ఉన్న పోలీసులపై రైతులు రాళ్లు, కుర్చీలు విసరంతో టెన్షన్ వాతావరణం నెలకొంది. పోలీసుల కళ్ళల్లో రైతులు కారం చల్లారు. డిసిపి యోగేష్ గౌతమ్‌తో సహా పలువురు సిఐలతో సహా మహిళా సిఐలకు గాయాలు అయ్యాయి.

రైతుల ఆవేదన...

బహదూర్‌గూడలో భారీ పోలీస్‌బందోబస్తుమధ్య భూములస్వాధీన ప్రక్రియ కొనసాగుతుండటంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాత్రినుంచి భోజనంకూడా లేకుండా ఇక్కట్లు పడుతున్నామని వాపోయారు. ముఖ్యమంత్రి స్వయంగా స్పందించి తమకు స్పష్టమైన హామీ ఇవ్వాలని, పెద్దమనుషులను పంపి తమకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. తమ భూములను కాపాడాలంటూ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

న్యాయంజరిగే వరకు పోరాటం: కార్తీక్‌రెడ్డి...

ఆందోళన చేస్తున్న బాధిత రైతులు, గ్రామస్థులకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన బిఆర్ఎస్ యువనేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టుచేశారు. అనంతరం ఆయనను నందిగామ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నందిగామ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలీసులు అరెస్టు చేసినంత మాత్రాన తాను వెనక్కితగ్గేది లేదన్నారు. రైతులకు న్యాయంజరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని స్పష్టంచేశారు. రైతుల హక్కులను కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టంచేశారు.

తోకల శ్రీనివాస్‌రెడ్డి ముందస్తు అరెస్టు...

రైతులకు సంఘీభావం తెలపడానికి బయలుదేరిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాజేంద్ర నగర్ నియోజకవర్గ నాయకులు తోకల శ్రీనివాస్‌రెడ్డిని పోలీసులు ఉదయం సుమారు 6గంటలకు గృహనిర్బంధం చేసేందుకు ప్రయత్నించగా, పోలీసులు, నాయకులు, కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకోంది. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు కొందరు కార్యకర్తలపై లాఠీచార్జ్ చేశారు. ఎట్టకేలకు తోకల శ్రీనివాస్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొని కాంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రైతులకు మద్దతు తెలిపేందుకు శాంతియుతంగా వెళ్తున్న నాయకులపై లాఠీచార్జ్‌చేసి అరెస్ట్‌చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని బిజెపి నాయకులు పేర్కొన్నారు.

ఆవేదన వ్యక్తంచేస్తున్న రైతులు

కళ్లలో కారంచల్లిన రైతులు

ఉత్తమ ప్రభుత్వ పాఠశాలగా తీర్చిదిద్దడమే లక్ష్యం

-మంత్రి మహ్మద్ అజహరుద్దీన్

-విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడిన మంత్రి

విద్యార్థులతో క్రికెట్ ఆడుతున్న మంత్రి

రంగారెడ్డిఅర్బన్, జులై 18, ప్రభాతవార్త:

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దడమే తెలంగాణప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ అన్నారు. శనివారం మంచాల మండలం ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించిన మంత్రి పాఠశాలలోని విద్య, క్రీడ, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమై ప్లేగ్రౌండ్‌లో కాసేపు క్రికెట్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల మధ్య ఉండటం ఎంతో ఆనందంగా ఉందని, ఆధునిక వసతులతో తీర్చిదిద్దిన ఈ ప్రభుత్వపాఠశాలను చూసి సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేకచొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతిగదులు, ఆధునిక ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, విశాలమైన క్రీడామైదానాలు, బాస్కెట్‌బాల్, వాలీబాల్, క్రికెట్ వంటి క్రీడాసదుపాయాలను ఏర్పాటుచేశామని తెలిపారు. తమ చిన్నతనంలో ఇలాంటి సౌకర్యాలు లేకపోయినా కష్టపడిచదివి, జీవితంలో ఎదిగామని గుర్తుచేసిన మంత్రి నేటి విద్యార్థులకు లభిస్తున్న అవకాశాలను పూర్తిగాసద్వినియోగంచేసుకుని ఉన్నతలక్ష్యాలను సాధించాలని సూచించారు. విజయం ఒక్కరోజులో సాధ్యమయ్యేది కాదని ఉన్నతస్థాయికిచేరుకున్న తర్వాతకూడా వినయాన్ని కోల్పోకుండా నిరాడంబరంగా ఉండటమే నిజమైన గొప్పతనమని మంత్రి పేర్కొన్నారు. ఈ పాఠశాలనుంచి భవిష్యత్తులో వైద్యులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, క్రీడాకారులు, పరిపాలనా అధికారులు తయారై రాష్ట్రానికి, దేశానికి సేవచేయాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆశీర్వదించారు. అదనపు కలెక్టర్ డా.కిరణ్మయి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అనేక వినూత్న కార్యక్రమాలను అమలుచేస్తోందన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని బలోపేతం చేస్తూ డైట్ ఛార్జీలను పెంచడం, విద్యార్థులకు పోషకాహారాన్ని అందించడం వంటి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం ద్వారా ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో నాణ్యమైనవిద్యను అందించేలా ఆధునిక మౌలిక సదుపాయాలతో పాఠశాలలను అభివృద్ధిచేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగంచేసుకుని ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నిరంతర కృషితో ప్రతిరంగంలో రాణించి రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి, మంచాల్ తహశీల్దార్, ఆరుట్ల సర్పంచ్ శోభారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌జిల్లా దొంగలముఠా అరెస్ట్, రిమాండ్

-తొమ్మిది మోటర్‌సైకిల్స్(బైక్స్) స్వాధీనం

-జవహర్‌నగర్ ఎసిపి ఎస్.చక్రపాణి వెల్లడి

కేసును ఛేదించిన ఎసిపి ఎస్.చక్రపాణి, సిఐ కె.నర్సింహ్మారెడ్డి, ఎస్ఐ శశివర్ధన్‌రెడ్డి, సిబ్బంది

శామీర్‌పేట, జులై 18, ప్రభాతవార్త:

అంతర్‌జిల్లా బైక్స్ (నలుగురు) దొంగలముఠాను శామీర్‌పేట పోలీసులు పట్టుకుని అరెస్ట్‌చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ఇళ్లవద్ద నిలిపి ఉన్న బైక్స్‌ను చోరీచేయటంజరిగినట్లు వారినుంచి 9మోటర్‌సైకిల్స్‌ను స్వాధీనంచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల తనిఖీల్లో మోటర్‌సైకిల్స్‌పై వెళ్తూ వారు పట్టుబడ్డారు. శనివారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఈకేసుకు సంబంధించి జవహర్‌నగర్ ఎసిపి ఎస్.చక్రపాణి విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్ ఎసిపి మాట్లాడుతూ అంతర్‌జిల్లా స్థాయిలో బైక్స్ చోరీచేస్తున్న నలుగురు దొంగలముఠాను శామీర్‌పేట పోలీసులు పట్టుకోవటం జరిగిందన్నారు. అయితే తూంకుంట సమీపంలోని దొంగలమైసమ్మ చౌరస్తావద్ద శుక్రవారం సాయంత్రం సమయంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా మోటర్‌సైకిల్ వాహనంపై నల్లగండ్ల నవీన్‌రాజు అలియాస్(బన్నీ) వెళుతుండగా తనిఖీలు చేయగా చోరీచేసిన బైక్‌గా గుర్తించటం జరిగిందన్నారు. అతనితోపాటు మైనర్ బాలుడు, ఆ తరువాత మరో ఇద్దరు మైనర్‌బాలురు పట్టుపడినట్లు తెలిపారు. మోటర్‌సైకిల్స్ చోరీచేయటంలో వారు స్పెషలిస్టులుగా ఉన్నారని గుర్తించినట్లు తెలిపారు. పోలీసులు విచారణచేపట్టగా మల్కాజ్‌గిరి ప్రాంతంలోని మిర్జాల్‌గూడకు చెందిన నల్లగండ్ల నవీన్‌రాజు అలియాస్ బన్నీ(19), మరో ముగ్గురు మైనర్‌బాలురు కలిసి వివిధ పోలీస్‌స్టేషన్లపరిధిలో 9మోటర్‌సైకిల్స్‌ను చోరీచేయటం జరిగిందన్నారు. అయితే శామీర్‌పేట, కీసర, కుషాయిగూడ, పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో, అదేవిధంగా పిఎస్ మణుగురు (ఖమ్మం జిల్లా) పోలీస్‌స్టేషన్ పరిధిలో వారు మోటర్‌సైకిల్స్ చోరీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు తెలిపారు. చోరీచేసిన మోటర్‌సైకిళ్లను వివిధప్రాంతాల్లో కొన్ని కొన్ని మోటర్‌సైకిల్స్‌ను స్టోర్‌చేశారని, అయితే 20నుంచి 30వరకు మోటర్‌సైకిల్స్ చోరీచేశాక వాటిని విక్రయించి సొమ్ముచేసుకోవాలని ఆ దొంగలముఠా భావించినట్లు తెలిపారు. స్టోర్‌చేసి ఉన్నచోట్ల నుంచి 9 మోటర్‌సైకిల్స్‌ను స్వాధీనంచేసుకున్నట్లు తెలిపారు. అయితే గతంలో కూడా పలుసార్లు మోటర్‌సైకిల్స్ చోరీచేసిన నిందితుడు నవీన్‌రాజు అలియాస్ బన్నీతోపాటు మైనర్లుగా ఉన్న ముగ్గురు హోమ్‌లో ఉన్న సమయంలో మోటర్‌సైకిల్స్ చోరీలుచేయాలని ఎత్తుగడలు వేసుకుని మోటర్‌సైకిళ్ల చోరీలకు పాల్పడినట్లు తేలిందని ఆయన తెలిపారు. వీరు ప్రధానంగా ఇళ్లముందు నిలిపి ఉన్న మోటర్‌సైకిల్స్‌ను చోరీచేయటం జరిగిందన్నారు. అయితే ఇళ్లముందు, ఇళ్లవద్ద నిలిపి ఉన్న మోటర్‌సైకిల్స్‌కు కొందరు కీస్ వాటికే వదిలిపెట్టటం వల్ల, మరికొందరివి బైక్స్ తాళాలువిరగొట్టి వారు చోరీలుచేశారని అన్నారు. మోటర్‌సైకిల్స్ విలువ పెరిగినందున చోరీలు జరిగే అవకాశం ఉంటుందని ప్రజలు మోటర్‌సైకిల్స్‌కు లాక్ (తాళాలు) వేసి జాగ్రత్తగా వ్యవరించాలని ఎసిపి చక్రపాణి ప్రజలకు సూచించారు. బైక్స్‌కు లెటెస్ట్ తాళాలు కూడ వచ్చినట్లు వాటిని వేసుకుంటే బాగుంటుందన్నారు. చోరీలను నివారించటానికి సిసికెమెరాలు ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని అన్నింటికి రక్షణ, భద్రతకు అవకాశం ఉంటుందని ఎసిపి సూచించారు. మోటర్‌సైకిల్స్ చోరీకేసులో నిందితులను పట్టుకుని వాటిని స్వాధీనం చేసుకున్నందున శామీర్‌పేట సిఐ కె.నర్సింహ్మారెడ్డికి, ఎస్ఐ శశివర్ధన్‌రెడ్డికి, సిబ్బందికి రివార్డులు ఇవ్వటానికి మల్కాజ్‌గిరి సిపికి సిఫారసుచేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శామీర్‌పేట సిఐ కె.నర్సింహ్మారెడ్డి, ఎస్ఐ శశివర్ధన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. మల్కాజ్‌గిరి సిపి సుమతి ఆదేశాల మేరకు డిసిపి శ్రీధర్ పర్యవేక్షణలో చోరీల నివారణకు చర్యలు తీసుకోవటం జరుగుతుందని జవహర్‌నగర్ ఎసిపి చక్రపాణి అన్నారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువగర్జనకు కదిలిన గులాబీ దండు

కొత్తూరు, జులై 18, ప్రభాతవార్త:

టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపునిచ్చిన యువగర్జన కార్యక్రమానికి కొత్తూరు మున్సిపాలిటీ, మండలం నుంచి టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. రాష్ట్రంలో రెండులక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నిరుద్యోగ యువతను మోసంచేసిందని ఆరోపిస్తూ, ప్రభుత్వంపై నిరసన వ్యక్తంచేసేందుకు యువ గర్జనకు బయలుదేరారు. ఈసందర్భంగా టిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని, యువతకు న్యాయంజరిగేవరకు టిఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్‌నాయకుడు దేవేందర్‌యాదవ్, ఎమ్మె సత్యనారాయణ, మాజీఎంపిటిసి రాజేందర్‌గౌడ్, కడాల శ్రీశైలం, దేశాల జైపాల్, దేశాల భీమయ్య, జంగాగల శివకుమార్, మహేందర్, రవినాయక్, కర్నూలు లక్ష్మయ్యలు ఉన్నారు.

తాండూరు అభివృద్ధికి మరో ముందడుగు

-రహదారుల నిర్మాణమే ప్రజాప్రభుత్వ ధ్యేయం

-రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దేముల్, జులై 18, ప్రభాతవార్త:

తాండూరు ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ సంకల్పంలో భాగంగా, రహదారుల నిర్మాణం కోసం భారీనిధులను మంజూరుచేయడం జరిగిందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం అంతారం గ్రామపరిధిలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎంఎల్‌సి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చేతులమీదుగా రూ.290కోట్ల విలువైన హ్యామ్ రహదారి పనులకు శంకుస్థాపనచేశారు. అనంతరం కందనెల్లి పరిధిలోని జిపిఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ప్రగతిసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కొడంగల్ తరువాత అత్యధిక నిధులు తాండూరుకే ఇచ్చామని అన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచిలా రాష్ట్రంలో ప్రపంచస్థాయి రహదారుల నిర్మాణమే మన ప్రజాప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఇందులో భాగంగానే ఈరోజు తాండూరు నియోజకవర్గంలో దాదాపూ రూ.290కోట్ల భారీ వ్యయంతో అత్యున్నత సాంకేతిక విధానమైన హైబ్రిడ్ యాన్యుటి మాడల్ (హ్యామ్) ద్వారా చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం సంతోషకరమని అన్నారు. ఈ హ్యామ్ విధానంలో కాంట్రాక్టర్లపైనే దీర్ఘకాలిక నిర్వహణబాధ్యత ఉండటంవల్ల రహదారుల నాణ్యతలో ఎలాంటిరాజీలేకుండా అత్యున్నత ప్రమాణాలు, మన్నిక సాధ్యమవుతాయని అన్నారు. అంతేగాకుండా ప్రతి గ్రామానికి మెరుగైన రవాణావ్యవస్థను కల్పించడం ద్వారా వ్యవసాయ, వాణిజ్య రవాణా వేగవంతమై గ్రామీణ అనుసంధానం మరింత బలోపేతం అవుతుందని అన్నారు. దేశంలోనే రేషన్‌దుకాణాల్లో సన్నబియ్యం ఇచ్చిన ఘనత, పాఠశాలల్లోని విద్యార్థులకు మొట్టమొదటగా బ్రేక్‌ఫాస్ట్ అందజేసిన ఘనత ప్రజాప్రభుత్వానిదేనని అన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలో 155 జిపిలకుగాను 125 జిపిల్లో కాంగ్రెస్ సర్పంచ్‌లను ప్రజలు ఆశీర్వదించారని అన్నారు. పార్టీచేస్తున్న అభివృద్ధిని చూసి తాండూరు మున్సిపల్‌లో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని అన్నారు. తాండూరుప్రజలకు తాను రుణపడి ఉన్నానని, మీ అందరి ఆశీర్వాదం ఇలాగే ఉండాలని ఆకాంక్షించారు. తాండూరుప్రాంత అభివృద్ధికోసం ఎన్ని నిధులైనా తీసుకురావడానికి కృషిచేస్తామని అన్నారు.

కార్యక్రమంలో చేవెళ్ళ ఎమ్మెల్యే కాలేయాదయ్య, కల్వ సుజాత, డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పి స్నేహా మెహ్రా, మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజాబాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పి.మహిపాల్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, పార్టీశ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు మహర్దశ

-అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

శంఖుస్థాపనచేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్
మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెట్టి వెంకట్‌రెడ్డి

వికారాబాద్, జులై 18, ప్రభాతవార్త:

దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణా రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి జరుగుతుందని శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శివారెడ్డిపేట ఆర్టిఓ కార్యాలయంవద్ద రూ.261 కోట్ల వ్యయంతో హ్యాం రోడ్ల పనులకు శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, రోడ్డు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ఇంచార్జిమంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, వికారాబాద్ నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని, ప్రతి మండలకేంద్రానికి బిటి రోడ్డు, డబల్ రోడ్డువేయాలనే లక్ష్యంతో నిధులువచ్చాయని తెలిపారు. నియోజకవర్గస్థాయిలో స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్‌ను అభివృద్ధిచేస్తానని సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చినమాటప్రకారం రోడ్ల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరుచేశారని అన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వరరెడ్డి, చేవెళ్ల, తాండూరు ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, బి.మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య, వైస్ చైర్మన్ అర్థ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి ముక్కులో చాక్‌పీస్

మేడ్చల్, జులై 18, ప్రభాతవార్త:

నూతన్‌కల్‌గ్రామ ప్రభుత్వ ప్రాథమికపాఠశాలలో 1వ తరగతి చదువుతున్న ఓచిన్నారి ఆటలమధ్య చాకోపీస్‌ముక్కను ముక్కులోపెట్టుకుంది. ఇది గమనించిన ఉపాధ్యాయులు, స్థానికులు 108అంబులెన్స్‌కు సమచారం ఇచ్చారు. సంఘటనాస్థలానికి చేరుకున్న 108 ఈఎంటి యాదమ్మ, పైలట్ తీరుపతి చాకచక్యంగా చిన్నారిముక్కులో ఇరుక్కున్న చాక్‌పీస్‌ను తొలగించారు. దీంతో చిన్నారి ప్రమాదంనుండి క్షేమంగా బయటపడగా, తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు 108అంబులెన్స్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

లారీ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

కుల్కచర్ల, జులై 18, ప్రభాతవార్త:

లారీ, బైక్‌ను ఢీకొన్న ఘటనలో మహిళకు తీవ్రగాయాలైన సంఘటన మండల పరిధిలోని ఘణపూర్ గేట్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాల్వీడ్‌గ్రామానికి చెందిన మన్నె కనకమ్మ, ల్యాగల వెంకటమ్మ, పెద్దరాములు బైక్‌పై కూలీపనికి కుల్కచర్ల వైపు వస్తున్న క్రమంలో కుల్కచర్ల నుండి మహబూబ్‌నగర్ వైపు లారీ అతివేగంగా బైక్‌ను ఢీకొట్టడంతో బైక్‌పైన ఉన్న మన్నె కనకమ్మ, ల్యాగల వెంకటమ్మ, పెద్దరాములు కిందపడ్డారు. లారీ డ్రైవర్ అజాగ్రత వల్ల కిందపడిన మన్నె కనకమ్మ, చేతిపైనుంచి లారీ వేగంగా దూసుకెళ్లింది. ఈ ఘటనలో మన్నె కనకమ్మ చేతిపై శరీరం పూర్తిగా నుజ్జుకావడంతో వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించడంతో వెంటనే 108 ఈఎంటి వినోద్‌కుమార్, పైలెట్ నర్సింలు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తుచేస్తునట్లు తెలిపారు.

30 కిలోల గంజాయి పట్టివేత

-వివరాలు వెల్లడించిన డిఎస్పీ అంజయ్య

విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ

నేడు ఛలో అంబేద్కర్ స్టాచ్యూ పేరిట 'మాలల మహా ధర్నా'

సైఫాబాద్, జులై 18 ప్రభాతవార్త: మాలల రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19న 'చలో అంబేద్కర్‌స్టాచ్యూ' పేరిట 'మాలల మహా ధర్నా' కార్యక్రమాన్ని ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద చేపడుతున్నామని జై భీమ్ మహిళా వెల్ఫేర్ అసోసియేషన్ తెలిపింది. ఈ మేరకు అంబేద్కర్ విగ్రహం ఎదుట అసోసియేషన్ ఛైర్ పర్సన్, అధ్యక్షురాలు సుధమల అంజలి, వైస్-ఛైర్మన్‌లు దాసరి విశాల్, కాడారం వినయ్‌కుమార్ తదితరులు ఈ ధర్నాకు సంబంధించిన కర పత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ ధర్నా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, గౌరవ అతిథిగా మాజీ ఎమ్మెల్యే సుద్దాల దేవయ్య పాల్గొంటారని తెలిపారు. ఎస్సీ గ్రూప్-3లో ఉన్న మాల, ఇతర 25 కులాలను మొదటి రోస్టర్ పాయింట్లను 22 నుంచి16కు మార్చాలని, అలాగే మాల, 25 ఇతర కులాలకు 50 లోపు మూడు రోస్టర్ పాయింట్లను కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ మహా ధర్నాలో మాలలు, మల ఉపకులాలకు చెందిన వారు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

టీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌ముదిరాజ్

టీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కవితను కలిసిన ప్రవీణ్ ముదిరాజ్

ముషీరాబాద్, జులై 18, ప్రభాతవార్త: తెలంగాన రక్షణ సేత (టిఆర్ఎస్) యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కంచి గారి ప్రవీణ్‌ముదిరాజ్ నియామకం అయ్యారు. ఈ మేరకు టీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను కలసి ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌ముదిరాజ్ మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యార్థి ఉద్యమాలలో, తెలంగాణ ఉద్యమంలో అనేక పర్యాయాలు పాల్గొని ఉద్యమాలు చేసిన తనను గుర్తించి, ఆనాడు తెలంగాణ జాగృతిలో హైదరాబాద్ నగర అధ్యక్షునిగా నియమించారని గుర్తు చేశారు. నేడు తన పనిని గుర్తించి, తెలంగాణ రక్షణ సేన యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అవకాశం ఇవ్వటం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. తనకు ఈ బాధ్యతను అప్పగించటంలో సహకరించిన పార్టీ మిత్రులందరికీ ధన్యవాదములు తెలియచేస్తున్నానన్నారు.

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలి : నవీన్ నికోలస్

ఎన్ఎస్‌పీసీ-2026 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నవీన్ నికోలస్

హైదరాబాద్, జూలై 18 (ప్రభాతవార్త) : జాతీయ విద్యార్థి పర్యావరణ పోటీ (ఎన్ఎస్‌పీసీ-2026) పోస్టర్‌ను తెలంగాణ పాఠశాల విద్యా సంచాలకులు నవీన్ నికోలస్ శనివారం ఆవిష్కరించారు. జూలై 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ పోటీ ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, వాతావరణ బాధ్యత, సుస్థిర జీవన విధానాలు, మిషన్ లైఫ్ సూత్రాలపై అవగాహన పెంపొందుతుందని ఆయన తెలిపారు. గతంలో తెలంగాణ ఈ పోటీలో విశేష ప్రతిభ కనబరిచిన నేపథ్యంలో, ఈ ఏడాది కూడా ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని రాష్ట్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ఎన్ఎస్‌పీసీ నోడల్ టీచర్‌గా నియమించి, "ఎన్ఎస్‌పీసీ దినోత్సవం" నిర్వహించడం ద్వారా విద్యార్థులందరూ ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ సంచాలకులు, ఎన్ఎస్‌పీసీ-2026 జాతీయ సహసమన్వయకర్త డా. డబ్ల్యూ.జి. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి పాఠశాల విద్యా శాఖ అందిస్తున్న సహకారానికి పాఠశాల విద్యా సంచాలకులు నవీన్ నికోలస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా శాఖ అధికారులు, నేషనల్ గ్రీన్ కార్ప్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

20న కలెక్టర్ కార్యాలయాల ముట్టడి : సుంకర రామ్మోహన్ రావు

అత్తాపూర్ జూలై18,ప్రభాతవార్త : భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 20న తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలంగాణ బిల్డింగ్ అండ్ ఆధర్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయు) రాష్ట్ర అధ్యక్షులు సుంకర రామ్మోహన్ రావు తెలిపారు. శనివారం ఆయన రాజేంద్రనగర్ లో విలేకరులతో మాట్లాడుతూ, కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఈ ధర్నా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు జరిగే ధర్నా కార్యక్రమంలో తాను పాల్గొంటానన్నారు.ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన జీవో నెం 12ను రద్దు చేసి వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికులకు సంక్షేమ పథకాలు ప్రభుత్వమే అందించాలన్నారు.ఇండ్లు లేని భవన నిర్మాణ కార్మికులకు ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. అర్హత కలిగిన భవన నిర్మాణ కార్మికులకు నమోదు చేసుకున్న 15 రోజులలోగా లేబర్ కార్డులను అందచేయా లన్నారు. డిమాండ్ల సాధన కు జరుగుతున్న పోరాటంలో కార్మిక లోకం అంతా కదిలిరావాలని సుంకర రామ్మోహన్ రావు పిలుపునిచ్చారు.

ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి

-ఎఇఆర్ఓ,రాజేంద్రనగర్ తహసీల్దార్ రాములు

అత్తాపూర్ జూలై18,ప్రభాతవార్త :

ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ కార్యక్రమంలో తమ పేర్లను తప్పకుండా నమోదు చేసుకోవాలని ఎఇఆర్ఓ,రాజేంద్రనగర్ తహసీల్దార్ బి. రాములు పేర్కొన్నారు.శనివారం ఎస్ఐఆర్ ప్రక్రియను ఎఇఆర్ఓ పరిశీలించి బిఎల్ఓలకు పలు సూచనలు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ...ఆదివారం(నేడు) శాస్త్రిపురం, మైలార్‌దేవ్‌పల్లి,లక్ష్మీగూడ,కాటెదాన్,బుద్వేల్ పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బిఎల్ఓలు అందుబాటులో ఉంటారని కావున ప్రతి ఒక్క ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను తీసుకొని ఫారమ్ ను పూర్తి చేసి బిఎల్ఓలకు అందజేయాలని సూచించారు.ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్లకు నెల వారి అద్దె రూ.55 వేలకు పెంచాలి : ఎంపి ఆర్.కృష్ణయ్య

ప్రసంగిస్తున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో నీల వెంకటేష్ తదితరులు

సైఫాబాద్, జులై 18 ప్రభాతవార్త: ప్రభుత్వ కార్యాలయాల్లో అద్దెకు వినియోగిస్తున్న కార్లకు నెలవారిగా రెంట్‌ను 34 వేల నుంచి 55 వేలకు పెంచాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. అలాగే ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని, ప్రతి నెల 5వ తేదీలోగా రెంట్ డబ్బులు కూడా ఇవ్వాలని ఆయన కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో 9 సంవత్సరాల క్రితం నిర్ణయించిన ధరలు ఇప్పటి కొనసాగడం దారుణమన్నారు. పెట్రోల్, డిజీల్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, రెట్టింపు అయినాయని ఆయన చెప్పారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ హైర్ వెహికిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే డ్రైవర్లకు 70 వేల రూపాయలు నెలకు వేతనం చెల్లిస్తున్నదని, వాహనం నిర్వహణకు అదనంగా మరో 30 వేల రూపాయలు ఖర్చు అవుతున్నదని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రెంట్ 34 వేల రూపాయలు చెల్లించి, చేతులు దులుపు కోవడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. అద్దె వాహనం దారుల విషయంలో వారి సమస్యలను నెల రోజుల్లో ప్రభుత్వం, సిఎం రేవంత్‌రెడ్డి, డిసిఎం మల్లు భట్టివిక్రమార్క దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారం కొసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తమ డిమాండ్ల సాధన కోసం గత మూడు రోజులుగా వాహనం దారులు సమ్మె చేస్తున్నారని, నేడు విరమించడం జరిగిందని, సమస్యలను పరిష్కరించకపోతే ఆగస్టు మాసం పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఈ సభలు బిసి నేతలు నీల వెంకటేష్, సి.రాజేందర్, అనంతయ్య, మహ్మద్ ఆలీ, అక్బర్, రాజు, షేక్ పిషా, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా పునరుద్ధరించాలి : మాజీ డిజిపి పూర్ణచంద్రరావు

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డీజీపీ డాక్టర్ జే.పూర్ణచంద్ర రావు

ముషీరాబాద్, జులై 18, ప్రభాతవార్త: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా పునరుద్ధరించాలని, దానికై క్రైస్తవ సమాజం ఏకమవ్వాలని మాజీ డీజీపీ జే.పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. శనివారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని ఆంధ్ర నరకిస్టియన్ కో ఆర్డినేషన్ కౌన్సిల్(సీసీసీ) ఆధ్వర్యంలో జరిగిన సమావేశంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రైస్తవ సమాజంలో ఎదుర్కొంటున్న సమకాలీన సమస్యలు, రాజ్యాంగ హక్కులు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య భాగస్వామ్యం వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ప్రార్థనా స్థలాలు సమాజ శ్రేయస్సు కోసం సంకల్పాలు చేసే పవిత్ర వేదికలన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా, క్రైస్తవులపై దాడుల నివారణ, మత మార్పిడి నిరోధక చట్టాల రద్దు కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. రాజకీయ అవగాహన లేకుండా సామాజిక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించదని, అందువల్ల క్రైస్తవ యువత రాజ్యాంగాన్ని అధ్యయనం చేసి, ప్రజాస్వామ్య ప్రక్రియల్లో మరుకుగా పాల్గొనాలని సూచించారు. ఓటు ప్రజల చేతిలో ఉన్న అత్యంత శక్తివంతమైన రాజ్యాంగ ఆయుధమని, సమాజ ప్రయోజనాలను కాపాడే నాయకత్వాన్ని ఎన్నుకోవటానికి దానిని చైతన్యంతో వినియోగించాలని సూచించారు. ఈ సమావేశంకు ఆంధ్ర క్రిస్టియన్ థియోలాజికల్ కాలేజి మాజీ ప్రిన్స్‌పాల్ జాన్ ప్రభాకర్ అధ్యక్షత వహించగా, ప్రిన్స్‌పాల్ వరకుమార్, మాజీ ఐపీఎస్ అధికారులు జి.ఆల్ఫ్రెడ్, కే.బాబూరావు, ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త పరంజ్యోతి, బీసీ టైమన్స్ సంపాదకులు సంగెం సూర్యారావు, డేనియల్, అశోక్ కుమార్, ఇతర క్రైస్తవ నాయకులు, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటానికి కార్యకర్తలు సిద్ధం కావాలి

సమావేశంలో ప్రసంగిస్తున్న బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్ , చిత్రంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చాతిరి పార్థసారథి

చిక్కడపల్లి జులై 18 (ప్రభాతవార్త) : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని భారతీయ జనతా పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మహంకాళి-సికింద్రాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చాతిరి పార్థసారథి, బొల్లంపల్లి రామిరెడ్డి, కలకోట అరుణ్ కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. భరత్ గౌడ్, పార్థసారథిర్ణంగా జిల్లా రాజకీయ పరిస్థితులు, బూత్ స్థాయి బలోపేతం, సభ్యత్వ నమోదు, రానున్న సంస్థాగత కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన ఉద్యమాలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. కార్యకర్తలు ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేయాలని నాయకులు సూచించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలపై పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్థసారథి మాట్లాడుతూ ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అవసరమైతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.

'సర్'లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలి : విహెచ్

'సర్' పత్రాలను వంపిణి చేస్తున్న విహెచ్, చిత్రంలో సచిన్ సావత్, మోత రోహిత్, శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, జూలై 18 ప్రభాతవార్త :

'సర్'లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు అన్నారు. తమ ఇన్యూమరేషన్ ఫామ్‌ను నింపకపోతే తమ ఓటు కోల్పోతారని, ఓటు మన హక్కు అని దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. శనివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో సర్ హెల్ప్ డెస్క్‌ను ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావత్,ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోత రోహిత్, జిల్లా మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్‌లతో కలిసి సర్ హెల్ప్ డెస్క్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా విహెచ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు, చిరునామా, ఇతర వివరాల్లో మార్పులు ఉంటే వెంటనే సరిచేయించుకోవాలని, కొత్తగా అర్హులైన వారు నమోదు చేసుకోవాలని కోరారు.ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి సచిన్ సావంత్ మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని అన్నారు. ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు మోత రోహిత్ మాట్లాడుతూ అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాలో పేరు నమోదు కాకుండా మిగిలిపోకూడదని, యువత, మహిళలు, కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, బీఎల్ఓలకు అవసరమైన వివరాలు అందించి ప్రతి పౌరుడు బాధ్యతగా ఈ కార్యక్రమంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు టిపిసిసి మాజీ జనరల్ సెక్రెటరీ ఆర్.లక్ష్మణ్‌యాదవ్,పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, బాగ్ అంబర్‌పేట్ డివిజన్ ప్రెసిడెంట్ రావుల సుధాకర్, గడ్డం శ్రీధర్ గౌడ్, కుంకుమ రాజేశ్వర్, సి సుధాకర్, మహేష్ గౌడ, సతీష్, పుట్ట రాకేష్,సునీత రెడ్డి, లావణ్య, శాంత మ్మ, శ్రీదేవి, సోనీ,గడ్డం సునీల్, ఈ డెల్లి రాకేష్,రోహన్ గౌడ్ ,సందీప్ గౌడ్, మొయిస్ బాయ్ , సర్ఫరాజ్, ఫిరోజ్ భాయ్, సల్మీముల్ల,సైఫ్,పాల్గొన్నారు.

మోడీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది : డా.పరకాల ప్రభాకర్

నదస్సులో మాట్లాడుతున్న పరకాల ప్రభాకర్

హైదరాబాద్ జులై 18 ప్రభాతవార్త : ప్రధాని మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని, తలసరి ఆదాయం ఆఫ్రికా దేశాలకంటే వెనుకబడి ఉందని, దీనితోపాటు నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల భారీ పెరుగుదల సామాన్యుల నడ్డివిరుగుతుందని ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు డా. పరకాల ప్రభాకర్ పేర్కొన్నారు. 57వ బ్యాంకుల జాతీయకరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్, గన్‌ఫౌండ్రిలో శనివారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 'భారత ఆర్థిక వ్యవస్థ సవాళ్లు ప్రాధాన్యత' అనే అంశం పై సదస్సు ఫెడరేషన్ అధ్యక్షుడు బి. రవీంద్ర నాథ్ అధ్యక్షతన జరిగింది. తొలుత ఏఐబిఈఏ జాతీయ అధ్యక్షులు బి.ఎస్. రాంబాబు స్వాగతం పలుకగా డా. పరకాల ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం, నైపుణ్యాల కొరత, అసంఘటిత రంగంలోని కార్మికుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఉపాధి కల్పన, స్కిల్ డెవలప్మెంట్ అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. బ్యాంకింగ్ రంగ ఉద్యోగులు సహా అన్ని రంగాల కార్మికులు పరస్పర సంఘీభావంతో పనిచేస్తేనే కార్మిక హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దేశంలో నిరుద్యోగం అధికారిక లెక్కల కంటే ఎక్కువగా ఉందని, డీమానిటైజేషన్ అనంతరం ఆర్థిక వ్యవస్థ తీవ్ర ప్రభావానికి గురైందని అభిప్రాయపడ్డారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలంటే వచ్చే 14 ఏళ్లలో అధిక ఆర్థిక వృద్ధితో పాటు భారీ స్థాయిలో ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఏడాది కనీసం 80 లక్షల నుంచి రెండు కోట్ల వరకు ఉద్యోగ అవకాశాలు సృష్టించే దిశగా కార్యాచరణ ఉండాలని సూచించారు. బ్యాంకుల జాతీయకరణ స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణతో పాటు కార్మిక సంఘాల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఏపిటిబిఈఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు ఉదయ్ భాస్కర్, సమద్ ఖాన్, జె. జానకిరామ్, అజయ్ కుమార్, మధుసూదన్, శైలేంద్ర, నల్లపు రెడ్డి, కుమార్, నాయక్, నిరంజన్, తేజేష్వి, నిహారిక, సుమలత, సుప్రియ, భార్గవి, పద్మ, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

సర్‌లో ఓటర్లు తమ పేర్లను నమోదు చేయించుకోవాలి



ఓటర్లకు గణన ఫారాలు అందజేస్తున్న సీనియర్ బిజెపి నాయకులు రమేష్ యాదవ్

చార్మినార్,జూలై 18 ప్రభాతవార్త : సర్ ప్రక్రియలో భాగంగా శనివారం సీనియర్ బిజెపి నాయకులు బి.రమేష్ యాదవ్ లాల్‌దర్వాజ ప్రాంతంలో గణన ఫారాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో ఓటర్లు బిఎల్ఓకు గణన ఫారాలు అందజేయాలని తెలిపారు.సర్‌లో ఓటర్లు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు.

మొబైల్ ఫోన్ల వ్యసనం పిల్లలపై తీవ్ర ప్రభావం : ఆధ్యాత్మికవేత్త బాగేశ్వర్ సర్కార్

హైదరాబాద్, జూలై 18 ప్రభాతవార్త

మొబైల్ ఫోన్ల వ్యసనం పిల్లలపై తీవ్ర ప్రభావాలను చూపుతుందని, దీని ప్రభావంతో విద్యార్థుల సృజనాత్మకత, ఆలోచనా శక్తి తగ్గిపోతాయని బాగేశ్వర్ ధామ్ బాలాజీ ఆలయ ప్రధాన పూజారి, ఆధ్యాత్మిక నాయకుడు శ్రీ బాగేశ్వర్ సర్కార్ తెలిపారు. శనివారం గుండ్లపోచంపల్లి, డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్‌లో డిఆర్ఎస్ఐఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ఆధ్యాత్మిక సమావేశం జరిగింది.ఈ సమావేశంలో పాల్గొని స్కూల్ ఆవరణలో జ్ఞాపక శీలా పలకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.ప్రసంగిస్తూ విద్యార్థులతో ఆధ్యాత్మిక సమావేశాలు వారిలో నైతిక విలువలు, మానసిక ప్రశాంతత మరియు ఏకాగ్రతను పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. మొబైల్ ఫోన్లు, ఇంస్టాగ్రామ్, పేస్ బుక్‌లకు దూరంగా ఉంటేనే ఏదైనా సాధించగలమని చెప్పారు. ప్రార్థన మరియు ధ్యానంతో ఒత్తిడి తగ్గి, చదువు, పరీక్షల భయం నుండి ఉపశమనం లభిస్తుందని తెలిపారు. పిల్లలకు పార్కులకు తీసుకెళ్లడం, పుస్తకాలు చదివే అలవాటును పెంపొందించాలని కోరారు. రామాయణం, మహాభారతం, స్వామి వివేకానంద వంటి మహనీయుల జీవితాల నుండి నీతి కథలను పిల్లలకు టీచర్లు చెప్పాలన్నారు. తల్లితండ్రులను, పెద్దలను గౌరవించడం, తోటి విద్యార్థులకు సహాయపడటం, ప్రకృతిని ప్రేమించడం వంటి సద్గుణాలను విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు.

విద్యార్థులతో ఆధ్యాత్మిక సమావేశంలో మాట్లాడుతున్న బాగేశ్వర్ ధామ్ బాలాజీ ఆలయ ప్రధాన పూజారి, ఆధ్యాత్మికవేత్త శ్రీ బాగేశ్వర్ సర్కార్

ఆధ్యాత్మికతను కేవలం పూజలకు పరిమితం చేయకుండా, దైనందిన జీవితంలో దాని ఆచరణాత్మక ప్రాముఖ్యతను అనుసరించాలని చెప్పారు. డిఆర్ఎస్ఐఎస్ డైరెక్టర్ గర్వ్ అగర్వాల్ స్వాగతపన్యాసం చేస్తూ విద్యార్థులలో శారీరక, మానసిక సమస్యలు మరియు ఒత్తిడిని తగ్గించడానికి విద్యార్థులతో ఆధ్యాత్మిక సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమకాలీన విద్యతో పాటు ఆధ్యాత్మికతను జోడించడం ద్వారా విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి ఉన్నతమైన వ్యక్తిత్వాలను తీర్చిదిద్దుకోగలుగుతారని చెప్పారు. ఈ సమావేశంలో సంస్థ చైర్మన్ దయానంద్ అగర్వాల్, డైరెక్టర్లు సంజయ్ కుమార్ అగర్వాల్, అంజనీకుమార్ అగర్వాల్, ప్రిన్సిపాల్ ఐ.వేణు గోపాల్‌తోపాటు వందలాదిమంది విద్యార్థులు పాల్గొన్నారు.

జెహెచ్ఐసి పాలకమండలి సభ్యులపై కేసు నమోదు

- నకిలీ పత్రాలు, ఫోర్జరీ సంతకాలు, రికార్డులు తారుమారు

- జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

జూబ్లీహిల్స్, జూలై 18, ప్రభాతవార్తః

జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్(జేహెచ్ఐసీ) పాలక మండలి ఎన్నికల వ్యవహారంలో నకిలీ పత్రాలు, సంతకాల ఫోర్జరీ, అధికారిక రికార్డుల తారుమారుపై జేఎచ్ఐసీ మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి సురేందర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ప్రస్తుత పాలకమండలితోపాటు పలువురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సురేందర్ రెడ్డి సెప్టెంబర్ 2023 నుంచి సెప్టెంబర్ 2025 వరకు జేఎచ్ఐసీ అధ్యక్షుడిగా పనిచేశారు. గతేడాది అక్టోబర్ 16న ప్రస్తుత పాలక మండలి సభ్యులు సొసైటీల రిజిస్ట్రార్ కార్యాలయానికి పాలక మండలి మార్పులకు సంబంధించిన పత్రాలను సమర్పించారు. ఈ వ్యవహారంలో అనుమానం రావడంతో సురేందర్ రెడ్డి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసి సంబంధిత ధృవీకరణ ప్రతులను పొందారు. వాటిని పరిశీలించగా తన సంతకాలతో పాటు పలు కీలక పత్రాలను ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. గతేడాది జూన్ 12న జరిగిన పాలక మండలి సమావేశం రికార్డుల్లో టి. నరేంద్ర చౌదరిని రిటర్నింగ్ అధికారిగా ఆమోదించినట్లు తప్పుడు వివరాలు చేర్చారు. ఆ సమావేశ మినిట్స్‌పై సురేందర్‌రెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేశారు. పాలక మండలి మార్పుపై ఎలాంటి వివాదం లేదని పేర్కొంటూ నో డిస్ప్యూట్ లెటర్ పేరుతో సురేందర్‌రెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేశారు. గతేడాది సెప్టెంబర్ 21న స్వచ్ఛందంగా పదవి నుంచి తప్పుకున్నట్లు పేర్కొన్న మరో లేఖలో నకిలీ సంతకాలు చేశారు. దీనికితోడుజేఎచ్ఐసీ ఎన్నికల ప్రక్రియలో సస్పెండ్ లేదా తొలగించబడిన సభ్యులను ఓటర్ల జాబితాలో చేర్చడమే కాకుండా కొందరు అర్హులైన సభ్యులను బెదిరించి ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకున్నారు. చివరకు ఎలాంటి పోటీ లేకుండానే 15 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించినట

అభ్యాసంపై ఆసక్తిని రేకెత్తిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

విద్యార్థులకు కుండలతయారీని చూపిస్తున్న దృశ్యం

కోట్‌పల్లి, జులై 18, ప్రభాతవార్త:

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసి అభివృద్ధిచేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతోకీలకమని సాయి విద్యానికేతన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్దు అన్నారు. శనివారం నాడు వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల కేంద్రంలోని సాయివిద్యానికేతన్ ప్రైవేట్‌పాఠశాల విద్యార్థులకు వినూత్న మైన ప్రత్యక్ష బోధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులను కుమ్మరి, కమ్మరి, వడ్రంగి వృత్తిదారుల వద్దకు తీసుకెళ్లి, వారు ఉపయోగించే పనిముట్లు, మట్టిపాత్రల తయారీ విధానం,ఇంటి నిర్మాణంలో ఉపయోగించే వివిధ వస్తువుల తయారీ ప్రక్రియను ప్రత్యక్షంగా చూపిస్తూ వివరించారు. అదే విధంగా సైన్స్ ఉపాధ్యాయుడు ప్రవీణ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో వివిధ శాస్త్రీయ ప్రయోగాలు నిర్వహించి వాటి వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాలను సులభంగా అర్థమయ్యేలా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగాపాల్గొని పలు సందేహాలను నివృత్తిచేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జనజాగరణ యాత్ర విజయవంతం చేయాలి

-టిఎస్‌సిపిఎస్‌ఈయు జిల్లా ప్రధాన కార్యదర్శి అయూబ్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

కొడంగల్, జులై 18, ప్రభాతవార్త:

జనజాగరణ యాత్రను విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధానకార్యదర్శి అయూబ్ పాష, కమిటీసభ్యుడు మురహరినాథ్, మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా సమన్వయ కార్యదర్శి దినేష్‌లు పిలుపునిచ్చారు.ఈనెల 19న కొడంగల్,తాండూర్,20న వికారాబాద్‌లో జరిగే జనజాగరణ యాత్ర పోస్టర్‌ను శనివారం కొడంగల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్‌సీపీఎస్‌ఈయూ మండల అధ్యక్షులు వేణు మాట్లాడుతూ పెన్షన్ ఉద్యోగుల ప్రాథమిక హక్కు అని, 2004లో ప్రవేశపెట్టిన సీపీఎస్‌విధానం వల్ల గత 22సంవత్సరాలుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. పదవి విరమణ అనంతరం సామాజిక భద్రత కల్పించడంలో సీపీఎస్ పూర్తిగా విఫలమైందని, ఉద్యోగులకు గౌరవప్రదమైన జీవన భరోసా కల్పించాలంటే పాతపెన్షన్ విధానం(ఓపీఎస్)ను పునఃరుద్ధరించాల్సిందేనని పేర్కొన్నారు. కాంగ్రేస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హమీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో జనజాగరణ యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈయాత్ర ముగింపు సందర్భంగా అగష్టు 23న ఛలోహైద్రాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. జులై 19న కొడంగల్,తాండూర్ నియోజకవర్గాల్లో అలాగే.జులై 20న వికారాబాద్,పరిగి నియోజకవర్గాల్లో జనజాగరణ యాత్రలో సీపీఎస్ ఉద్యోగులు,ఉపాధ్యాయులు,వారి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరి సాగులో కొత్త విప్లవం

దౌల్తాబాద్, జులై 18, ప్రభాతవార్త:

వికారాబాద్‌జిల్లా దౌల్తాబాద్‌మండలం చల్లూపూర్ గ్రామంలోని రైతువేదికలో వరి సాగులో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు.టెర్రత్రాక్ సంస్థ,వాసన్ ఫౌండేషన్,అరక రైతు ఉప్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీఓ) సంయుక్త ఆధ్వర్యంలో 'తడి-పొడి"(ఎడబ్ల్యూ) వరి సాగు పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు.దౌల్తాబాద్,దోమ మండలాల్లో సుమారు 300 ఎకరాల్లో చేపడుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా,ప్రత్యేక పీపీసీ పైపులను ఉపయోగించి నేలలోని తేమను బట్టి అవసరమైనప్పుడు మాత్రమే నీటిని అందించడం జరుగుతుందన్నారు.ఈ విధానం వల్ల నీటి పొదుపుతో పాటు దిగుబడి పెరుగడమే కాకుండా,వరి పొలాల నుంచి వెలువడే మీథేన్ వాయువు తగ్గి పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని,ఈ పద్ధతిని పాటించే రైతులకు కార్బన్ క్రెడిట్ పథకం కింద ఎకరానికి రూ.400 ప్రోత్సాహకాన్ని అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారన్నారు.ఎల్-నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్నందున,రైతులు తక్కువ కాల వ్యవధిలో పండేపంటలను ఎంచుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు,అధికారులు,రైతులు పాల్గొని ఈ కొత్త సాగు విధానం పట్ల హర్షం వ్యక్తంచేశారు.

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్, జులై 18, ప్రభాతవార్త:

గ్రామీణ ప్రజలు ఉచిత వైద్య శిభిరాలను సద్వినియోగం చేసుకోవాలని మద్దూర్ సర్పంచ్‌రాజునాయక్, ఉపసర్పంచ్ రాంరెడ్డి అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని మద్దూర్ గ్రామంలో జిమ్స్ హోమియోపతి మెడికల్ మరియు హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా హోమియోపతి మందులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 100 మందికి పైగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పేద ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు కార్పోరేట్ ఆసుపత్రులు పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముందుకు రావాలన్నారు. పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి అవకాశాలు గ్రామీణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇలాంటి అవకాశాలు గ్రామీణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ... హోమియోపతి అనేది సురక్షితమైన, శాస్త్రీయ ఆధారాలతో అభివృద్ధి చెందిన వైద్యవిదానం అన్నారు. ప్రతి శని వారం మద్దూర్ గ్రామపంచాయితీ కార్యాలయం వద్ద ఈక్యాంపు ఉంటుం దని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సందీప్కుమార్ గౌడ్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు

తాండూరు, జులై 18, ప్రభాతవార్త:

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత ఈఎన్‌టీ వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్యసంఘం తాండూరు, మా ఈఎన్‌టీ ఆసుపత్రి హైదరా బాద్ సౌజన్యంతో పట్టణంలోని ఆర్యవైశ్య ఓపెన్ ఆడిటోరియంలో శని వారం ఉచిత చెవి, ముక్కు, గొంతు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆర్య వైశ్య సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కట్కం వీరేందర్, సంఘం పెద్దలు కోస్గి తిప్పయ్య, నగరేశ్వర్ దేవాలయ చైర్మన్ దాదాపురం సతీష్, సంఘం కార్యవర్గం సలహా మండలి సభ్యులు భీమ్ శెట్టి అనిల్ కుమార్, కల్వ రవికుమార్, డాక్టర్ సతీష్‌బాబు, డాక్టర్ మేడిశెట్టి పాండురంగం, డాక్టర్ విశాల, డాక్టర్ అక్షయ్ వైద్య శిభిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోట మురళీకృష్ణ, కార్యదర్శి కోట్రిక కిరణ్, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి మహిళాసంఘం కార్యవర్గ సభ్యులు, క్యాంపు చైర్మన్ రాఘవేందర్, మంతటి అనిల్, కల్వ రాజవంశీ, పోల వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

జిల్లెడు చౌదరిగూడ, జులై 18, ప్రభాతవార్త:

జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వేచ్ఛ పౌండెషన్ వారు నోటు పుస్తకాలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు స్వేచ్ఛ పౌండెషన్ అధ్యక్షుడు వాసు దేవరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సుప్రిత, సురేష్ కుమార్‌రెడ్డి, కృష్ణ, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

జీవో 641 రద్దు చేయాల్సిందే..

-లేకపోతే ఉద్యమం మరింత ఉధృతం

-ఉధృతమవుతున్న డంపింగ్‌యార్డు వ్యతిరేక ఉద్యమం

నిరసన కారులకు సూచనలు చేస్తున్న డిసిపి శిరీష

కొత్తూరు, జులై 18, ప్రభాతవార్త:

సిద్దాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డు ఏర్పాటుకు సంబంధించిన జీఓ నం. 641ను రద్దు చేయాలన్న డిమాండ్‌తో సాగుతున్న ప్రజా ఉద్యమం రోజురోజుకూ ఉధృతమవుతోంది. డంపింగ్ యార్డు హటావో.. జేపీ దర్గా బచావో నినాదంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. చలోకలెక్టరేట్‌కు బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను కొత్తూరు పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. పోలీసులు భారీగా మోహరించి నిరసనకారులను అదుపులోకితీసుకునే ప్రయత్నంచేసినప్పటికీ, ప్రజలు వెనక్కితగ్గకుండా కొత్తూరువైపు దూసుకెళ్లడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో డీసీపీ శిరీష ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నంచేశారు. ఈ సందర్భంగా డీసీపీ శిరీష మాట్లాడుతూ.. సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించేందుకు అనుమతిస్తామని, ముఖ్య నాయకులు వెళ్లి తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లవచ్చని తెలిపారు. అనంతరం ప్రజలు, నాయకులను అక్కడి నుంచి పంపించివేశారు.

కాంగ్రెస్ నేతల అరెస్టులు...

చలో కలెక్టరేట్‌కు తరలివెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్‌రెడ్డిని పోలీసులు తెల్లవారుజామునే అరెస్టుచేసి కొత్తూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. జీఓ నం.641 రద్దయ్యేవరకు తమ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే జీఓను రద్దు చేయకపోతే జేపీ దర్గాలో దీక్షకు దిగుతానని హెచ్చరించారు. తాము కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పటికీ, పార్టీ కంటే తమ ప్రాంత ప్రజల సంక్షేమమే ముఖ్యమని అన్నారు. ప్రజల మనోభావాలను గౌరవించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని జీఓ నం.641ను రద్దుచేయాలని శేఖర్‌రెడ్డి డిమాండ్‌చేశారు. డంపింగ్ యార్డు ఏర్పాటుతో ప్రజల జీవన భద్రత, పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. జీఓ రద్దు చేసే వరకు ప్రజల పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఉన్నతశిఖరాలకు ఎదగాలి: సర్పంచ్

పూడూరు, జులై 18, ప్రభాతవార్త:

చదువే మనిషికి జీవం, చదువులేని జీవితం నాశనమని, విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతశిఖరాలకు ఎదగాలని సర్పంచ్ టి.దయాకర్ పేర్కొన్నారు. శనివారం పూడూరు మండలపరిధిలో ఎన్కెపల్లి ఆదర్శపాఠశాల వసతి గృహంలో విద్యార్థులకు దుప్పట్లు,ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షూలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ నాణ్యతగలవిద్యను అందించే ప్రభుత్వబడుల్లో పిల్లలను చేర్పించాలన్నారు.తల్లిదండ్రులు పిల్లలకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తే ఆటపాటలతోపాటు విద్యాభ్యాసన పట్ల శ్రద్ధచూపే అవకాశం ఉందని వివరించారు.ఉప సర్పంచ్ విజయ్,వార్డెన్ విజయలక్ష్మి, ప్రాథమికపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిర, పంచాయతీ వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువే దేశానికి వెలుగు

షాబాద్, జులై 18, ప్రభాతవార్త:

విద్యార్థుల చదువేదేశానికి వెలుగుతెస్తుందని, విద్యార్థులను ప్రొత్సహించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని మండల విద్యాధికారి లక్ష్మ ణ్ నాయక్ అన్నారు. మండలపరిధిలోని అంతారంగ్రామానికిచెందిన ఈగ మహిపాల్‌రెడ్డి విద్యార్థులకు స్కూల్‌బ్యాగులు అందజేశారు. ఈసందర్భంగా ఎంఈవో లక్ష్మ ణ్ నాయక్ మాట్లాడుతూ... ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పని చేసి పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఇం టర్, డిగ్రీ చదివిన వారే విద్యను భోదిస్తారని, ప్రభుత్వ పాఠశాలల్లో బీఈడీ చదివిన వారు భోదిస్తారన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఇంత గొప్ప మనసున్న దాత మహిపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానోపాధ్యాయ ఎలు శేఖర్ గౌడ్, ఉపాధ్యాయులు హేమలత, గ్రామస్తులు జంగారెడ్డి, ప్రదీప్తి, శ్రీశైలం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవాలి

మున్సిఫ్‌కోర్టు మెజిస్ట్రేట్ మహ్మద్ అసదుల్లా షరీఫ్

జోగిపేట, జులై 18, ప్రభాతవార్త: ఇరువర్గాలు పట్టింపులకు పోకుండా సామరస్యంతో కేసులను పరిష్కరించుకుంటే సమయంతోపాటు డబ్బులు ఆదా అవుతాయని జోగిపేట మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. శనివారం జోగిపేట కోర్టులో నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి విషయాలకు కోర్టుల చుట్టూ తిరగటం సరికాదని ఆయన సూచించారు. ఇందులో బ్యాంకు వివాదాలు, రుణాల రికవరీ కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు లింగమయ్య, ఇంద్రసేనా రెడ్డి, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌నినో అప్రమత్తంపై రైతులకు అవగాహన

టేక్మాల్(అల్లాదుర్గం) జూలై 18, ప్రభాతవార్త: ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున, రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారి రాజేష్‌కుమార్ సూచించారు. శనివారం గడిపెద్దాపూర్ గ్రామంలో నిర్వహించిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకుంటూ, తక్కువ నీటితో పండే సజ్జ, కొర్రలు, ఆముదం, ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని కోరారు. వాతావరణ శాఖ సూచనలను నిరంతరం గమనిస్తూ, ఎరువుల వినియోగం, పురుగుల నివారణ పంటల యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ శాఖ అధికారుల సలహాలను పాటించాలని కోరారు. రైతుల సందేహాలను నివృత్తిచేస్తూ, ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవడానికి వ్యవసాయ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని అధికారులు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ హరికృష్ణ, వార్డు సభ్యులు సత్య నారాయణ, అనిల్, ఇంచార్జీ ఎంపిడిఓ కాశీరామ్, ఏఈఈ ఇరిగేషన్ హేమ బిందు, ఏపిఎం రుక్మిణి, ఫాక్స్ సిఇఒ శివ గౌడ్, హెచ్‌ఈఓ కృపానందు, పంచాయతీ కార్యదర్శి జనార్దన్, ఏఈఓ విఠల్‌రావు, రైతులు పాల్గొన్నారు.

వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తే కఠిన చర్యలు

అందోలు-జోగిపేట మున్సిపల్ కమిషనర్ తిరుపతి

జోగిపేట, జులై 18, ప్రభాతవార్త: బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను పారబోస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అందోలు-జోగిపేట మున్సిపల్ కమీషనర్ తిరుపతి హెచ్చరించారు. శనివారంనాడు జోగిపేట-పోసానిపేట రోడ్డు ప్రాంతంలో అక్రమంగా చికెన్ వ్యర్థాలను పారబోస్తుండగా మున్సి పల్ సిబ్బంది పట్టుకుని జరిమాన విధించారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఎవరూకూడా వ్యర్థాలను బహి రంగ ప్రదేశాల్లో పారబోయొద్దని తెలిపారు. కాగా అక్రమ వ్యర్థాలను పార బోస్తున్న వ్యక్తిని పట్టుకున్నవారిలో మున్సిపల్ సిబ్బంది ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, వర్క్ ఇన్స్‌పెక్టర్ మహేందర్‌లు పాల్గొన్నారు.

జీపీవోపై దాడి హేయమైన చర్య

చౌటకూరు, జూలై 18, ప్రభాతవార్త: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం వడ్డేపల్లి జీపీవో సంబరబోయిని సత్యనారాయణపై దాడిచేయడం అమానుషమని గ్రామ పాలన అధికారుల సంఘం చౌటకూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎండి ఖాజాసమీర్, ఈశ్వర్ ఖండించారు. శుక్రవా రం సంఘం జిల్లా అధ్యక్షులు నాయికోటి సత్యనారాయణతో కలిసి చౌ టకూరు తహసీల్దార్ నామాల కిష్టయ్యకు వినతిపత్రం అందచేశారు. విధి నిర్వహణలో భాగంగా ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రీను పర్యవేక్షిస్తున్న సత్య నారాయణపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా అసభ్యంగా తిడుతూ దాడిచేసి గాయపర్చారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగిపై దాడిచేసిన ముక్కగల్ల సత్యనారాయణను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితమే సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రతిక్ జైన్‌కు వినతి పత్రం అందచేశామని నాయికోటి సత్యనారాయణ గుర్తు చేవారు.

ఉద్యోగులు చేసిన సేవలే గుర్తింపునిస్తాయి : డిఎల్‌పివో

నాగల్‌గిద్ద, జులై 18, ప్రభాతవార్త: విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని నారాయణఖేడ్ డిఎల్‌పిఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం నాగల్‌గిద్దలో పంచాయతీ కార్యదర్శుల ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఓ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు నిజాయితీగా విధులు నిర్వర్తిస్తే ప్రజల మన్ననలు అందుకుంటారన్నారు. బదిలీపై వెళుతున్న పంచాయతీ కార్యదర్శులను శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపిడిఓ మహేశ్వరరావు, ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అందెశ్రీ స్మారకవిజ్ఞాన కేంద్రానికి భూమిపూజ చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి, అందెశ్రీ కుటుంబసభ్యులు

ఇతర గ్రామాల ఫారాలతో బిఎల్‌ఓలకు ఇబ్బందులు

సిర్గాపూర్, జూలై 18, ప్రభాతవార్త: మండలంలో ఎస్‌ఐఆర్ ప్రక్రియలో భాగంగా బిఎల్‌ఓలకు ఇతర గ్రామాల ఎన్యూమరేషన్ ఫారాలు రావడంతో గందరగోళం నెలకొంది. బోరంచ, పాట్టిపల్లి, కడ్పల్ గ్రామాలకు చెందిన ఫారాలు రావడంతో సమస్యలు ఎదురవుతున్నాయనని బిఎల్‌ఓలు వాపోతున్నారు. దీనిపై స్పష్టత ఇవ్వాలని,ఓటర్ల హక్కులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బ్యాంక్ రుణాలతో రైతులకు ప్రయోజనాలు

సిర్గాపూర్, జూలై 18, ప్రభాతవార్త: బ్యాంక్ ద్వార రుణాలతో రైతులు ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని టిజిబి బ్రాంచ్ మేనేజర్ గోపాల్, ఫీల్డ్ ఆఫీసర్ సాయకృష్ణలు అన్నారు. మండల పరిధిలోని వాసర్ గ్రామంలో వాసర్ వాటర్ షెడ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు అందచేస్తున్నా మన్నారు. ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రీకరణ ఇంప్ల రుణ ఔకర్యం కల్పి స్తామని చెప్పారు. సీఈఓ చంద్రశేఖర్, వాటర్ షెడ్ చైర్మన్ హను మంతరావు, సెక్రటరీ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మారేపల్లి అభివృద్ధికి సహకరిస్తా : మాజీ ఎంపీపీ మనోజ్ రెడ్డి

కొండాపూర్, జూలై 18 ప్రభాతవార్త : తండ్రి జ్ఞాపకార్థంగా మారెపల్లిలో అభివృద్ధి చేసి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని మాజీ ఎంపీపీ మనోజ్‌రెడ్డి అన్నారు. శనివారం మారెపల్లి గ్రామానికి చెందిన పట్లోళ్ల నారాయణరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం ఆయన కుమారులు మాజీ ఎంపీపీ మనోజ్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి సొంత నిధులు 20 లక్షల వ్యయంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టేట్ ర్యాంక్ సాధించిన విద్యార్థులకు లాప్‌టాప్‌లను అందజేశారు. గ్రామం లోని కొత్త కుంటను అభివృద్ధి చేసి బతుకమ్మ మెట్లు నిర్మించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5 లక్షలతో విద్యార్థులకు శౌచలాయాలను నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అశోక్ మాట్లాడుతూ తండ్రి జ్ఞాపకార్థం కుమారులు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఎంఈఓ దశరథ్ మాట్లాడుతూ విద్యార్థులకు నారాయణరెడ్డి కుమారులు తోడ్పాటునివ్వడం ఆనందంగా ఉందన్నారు. స్టేట్ బ్యాంక్ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రెనింగ్ ఇన్స్టిట్యూట్ లో శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లను డైరెక్టర్ రాజేష్‌తో కలిసి అంద జేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంజీవరావు, మాజీ సర్పంచ్‌లు వెంకటేశంగౌడ్, రుక్మోద్దీన్, సొసైటి చైర్మన్ రాజు, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంట నివారణ టీకాలు

మనూర్, జూలై 18, ప్రభాతవార్త:

మండల పరిధిలోని తుమునూర్‌లో శనివారం ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో పశువులకు గాలికుంట నివా రణ టీకాలు వేశారు. పశువులకు ఎలాంటి వ్యాధులు రాకుండా ఉండేందుకు గాలికుంట టీకాలు వేయడం జరుగుతుందని పశువైద్యాధికారులు పేర్కొ న్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంజీవులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్‌లో మూడోవార్డును ఆదర్శంగా నిలుపుతాం

కౌన్సిలర్ అరుణకుమారి

జోగిపేట, జూలై 18, ప్రభాతవార్త: ఎస్‌ఐఆర్ ప్రక్రియలో అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో మూడవ వార్డును ఆదర్శంగా నిలుపుతు న్నామని వార్డు కౌన్సిలర్, అందోలు నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్య క్షురాలు మర్రి అరుణకుమారి తెలిపారు. ఇప్పటివరకు మున్సిపాలిటీ పరిధి లో తమ వార్డులోనే అత్యధికంగా నమోదు పూర్తిచేసినట్లు ఆమె తెలిపారు. వార్డు పరిధిలోని 203,204 బూత్‌లలో 73శాతానికి పైగా డిజిట లైజేషన్ పూర్తిచేశామని ఆమె తెలిపారు. ముఖ్యంగా బూత్‌స్థాయి కార్యకర్తలు, ప్రజ లతో సత్సంబంధాలే ప్రధాన కారణమని ఆమె పేర్కొన్నారు. మిగిలినవారి ఓటర్ల వివరాలను త్వరలో డిజిటలైజేన్ చేస్తామని,ఇంటింటికీ వెళ్లి ఎస్‌ఐఆర్ లో నమోదు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు.

విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల సమావేశం

టేక్మాల్, జూలై 18, ప్రభాతవార్త: తెలంగాణ విద్యాశాఖ ఆదేశాల మేరకు టేక్మాల్ మండలంలోని ఆదర్శ పాఠశాల (మోడల్‌స్కూల్)లో శనివారం తల్లి దండ్రుల ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈవిద్యా సంవత్సరం జూలై నెల సమావేశం కోసం పేరెంట్స్ ప్రామిస్ అనే సరికొత్త థీమ్‌ను పాఠశాల యాజమాన్యం ప్రవేశపెట్టింది. విద్యార్థుల ప్రగతిపై సమగ్ర చర్చ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుంకరి సాయిలు నేతృత్వంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో నేరుగా సమావేశమై చర్చించారు. విద్యార్థుల విద్యాప్రమాణాలు, డిజిటల్ క్లాసులు, ల్యాబ్స్ వినియోగం, హాజరుశాతం క్రమశిక్షణ వంటి అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. శతశాతంహాజరుపై పిలుపుపాఠశాల అభివృద్ధిలో పిల్లల ఉజ్వలభవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత కీలకమని ప్రిన్సిపాల్ సుంకరి సాయిలు పేర్కొన్నారు. భవిష్యత్తులో నిర్వహించే ప్రతి సమావేశానికి తల్లిదండ్రులు వంద శాతం హాజరు కావాలని, విద్యార్థుల ఎదుగుదల కోసం పాఠశాల యాజమాన్యంతో కలిసి పనిచేయాలని ఆయన కోరారు.

జడ్‌పిహెచ్‌ఎస్‌లో తాగునీటి సమస్య పరిష్కారం

జోగిపేట, జూలై 18, ప్రభాతవార్త: మండల పరిధిలోని నేరెడిగుంట జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన మరమ్మతు పనులను శనివారంనాడు గ్రామ సర్పంచు ఒగ్గు సాయికిరన్ ప్రారంభించారు. పాఠశాలలో శాశ్వతంగా తాగునీటిసమస్

దైవిక వ్యర్థాల సేకరణకు స్పందన

దేవుడి ప్రతిమలను తీసుకుంటున్న డిప్యూటీ కమిషనర్ సుదాంష్

మేడ్చల్, జులై 18, ప్రభాతవార్త:

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న డివైన్ వేస్ట్ కలెక్షన్ (దైవిక వ్యర్థాల సేకరణ) కార్యక్రమాన్ని మేడ్చల్ పట్టణంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 8.30 గంటల నుండి 11.00 గంటల వరకు దేవుడి ఫోటోలతో ఉన్న పాతకాలెండర్లు, దేవుడిప్రతిమలు, ఫోటోఫ్రేమ్‌ల వ్యర్థాలను ప్రజలనుండి స్వీకరించారు. స్వీకరించిన ఈ డివైన్ వేస్ట్ కలెక్షన్‌ను రీ సైక్లింగ్ చేయనున్నట్లు మేడ్చల్‌సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుదాంష్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మెన్ రాధకృష్ణమూర్తి, మున్సిపల్ డిఈ విజయలక్ష్మీ, వాలంటీర్లు, మున్సిపల్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే పరీక్ష.. ఒకే మార్కులు

-ఇప్పలపల్లి గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్ల అరుదైన రికార్డు

అక్కాచెల్లెళ్లు వైష్ణవి, రక్షిత

కేశంపేట, జులై 18, ప్రభాతవార్త:

ఒకే ఇంట్లో డబుల్ ధమాకా. ఇద్దరూ 514మార్కులు సాధించారు. చదువులో వారిద్దరూ ఒకరికొకరు పోటీ అనుకున్నారు. కానీ ఫలితాల్లో మాత్రం మేమిద్దరం ఒక్కటే అని నిరూపించారు. పరీక్ష ఏదైనా మార్కులు మాత్రం ఇద్దరికీ సమానంగా రావడంతో ఆ కుటుంబంలో ఆనందం రెట్టింపయింది. కేశంపేట మండలపరిధిలోని ఇప్పలపల్లిగ్రామానికి చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు కుమ్మరి వైష్ణవి, కుమ్మరి రక్షిత నీట్ పరీక్షాఫలితాల్లో 514మార్కులు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇప్పలపల్లిగ్రామానికి చెందిన ఈ ఇద్దరు సోదరీమణులు గురుకులవిద్యాలయంలో విద్యనభ్యసించారు. మొదటి ప్రయత్నంలో ఆశించిన ఫలితాలురాలేదు. దీంతో కష్టకాలంలో ఉన్న తల్లిదండ్రులను ఒప్పించి అప్పులు చేసి హైదరాబాద్లోని హయత్‌నగర్‌లో డాక్టర్స్ నీట్ అకాడమీలో కోచింగ్ తీసుకున్నారు. తల్లిదండ్రుల త్యాగాన్ని వమ్ముచేయకుండా వైష్ణవి, రక్షిత ఎంతో కష్టపడి చదివి, ఒకరికొకరు సహాయం చేసుకుంటూ పరీక్షలకు సిద్ధమయ్యారు. విడుదలైన ఫలితాల్లో అక్కాచెల్లెలు ఇద్దరూ కచ్చితంగా 514 మార్కులతో ఉత్తీర్ణత సాధించడం విశేషం. పాయింట్ల తేడాకూడా లేకుండా ఇద్దరికీ ఒకేలాగా మార్కులురావడంతో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఈ అరుదైన విజయంతో ఇప్పలపల్లి గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. బాలికల తల్లిదండ్రులను, గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. మా ఇద్దరికీ ఒకేరకమైన మార్కులురావడం చాలా సంతోషంగా ఉంది. కలిసి చదువుకోవడం వల్లే ఇది సాధ్యమైందని ఆ అక్కాచెల్లెళ్లు ఆనందం వ్యక్తంచేశారు.

యువతకు అండగా బిఆర్ఎస్

-మాజీ జడ్పీటిసి వట్నం అవినాష్‌రెడ్డి



నదస్సుకు బయలుదేరిన వట్నం అవినాష్‌రెడ్డి తదితరులు

షాబాద్, జులై 18, ప్రభాతవార్త:

ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు యువత సిద్ధం కావాలని, యువత చేతిలోనే రాష్ట్ర భవిష్యత్తు ముడిపడి ఉందని మాజీ జడ్పీటీసీ వట్నం అవినాష్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలో సరూర్‌నగర్లో కేటీఆర్ ఆధ్వర్యంలో తలపెట్టిన యువసంగ్రామ సదస్సుకు మండలం నుండి భారీ ఎత్తున బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులను, యువతను విస్మరిస్తున్న ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పాలన్నారు. యువత భవిష్యత్ కోసం, కేటీఆర్ చేతుల్లోనే కలదని, మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసే వరకు యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. చేతకాని ప్రభుత్వంనకు ఓటుతో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధగ్రామాల సర్పంచులు పర్వేద నర్సింహులు, ఉపసర్పంచ్ శివకుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మజీద్ నిర్మాణ పనులు ఆపండి

-జోనల్ కమిషనర్‌కు కాలనీవాసుల వినతి

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

శంషాబాద్, జులై 18, ప్రభాతవార్త:

శంషాబాద్ సర్కిల్ పరిధిలోని ప్రకాష్ నగర్‌లో పోతురాజు దేవాలయం పక్కన భూమి యజమాని అయినటువంటి షరీఫ్ పోతురాజు దేవాలయ పక్కన మజీద్ నిర్మించడానికి ఏర్పాట్లుచేస్తున్నాడని దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆ కాలనీవాసి నర్రగిరి అన్నారు.శనివారం నిర్మాణ పనలు వెంటనే ఆపాలని డిమాండ్‌చేస్తూ కాలనీవాసులు జోనల్ కమిషన్, డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా మసీదు, పోతురాజు దేవాలయాలు ఒక దగ్గర అవుతాయని వీటి వలన భవిష్యత్తులో హిందూ ముస్లిం గొడవలు ప్రారంభమై మతకలహాలకు దారితీస్తాయని ఒక మత మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్న ఈ నిర్మాణాన్ని తక్షణమే ఆపాలని వారు కోరారు. బలవంతంగా నిర్మాణంచేస్తే పై అధికారులను కలిసి వినతి పత్రం ఇచ్చి ఆతదుపరి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం అధికారులు తక్షణమే జోక్యంచేసుకొని ఆనిర్మాణపనులు ఆపాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో నర్ర యాదగిరి, నర్ర శ్రీను, నర్ర రామారావు, మొక్కల విజయ్ కుమార్, మొక్కల శేఖర్, మక్కల ప్రేమ్, మక్కల నరేష్, మొక్కల రాజు, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో రైతన్నల ఆనందం

మోమిన్‌పేట్, జులై 18, ప్రభాతవార్త:

రైతులు వ్యవసాయంపై ఆధారపడిన రైతులు విత్తిన పంటలు మొలకెత్తి వాడుపట్టడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. శుక్రవారంరాత్రి శనివారం కురిసినవర్షంతో రైతులముఖాలలో ఆనందం వెల్లివిరిసింది. గత వారంపదిరోజులుగా వర్షాలకోసం కప్పకావడి, పసుపుకుంకుమలతో వేప కొమ్మలుకట్టి మహిళలు పాటలుపాడుతూ ఊరంతాతిరిగి చివరికి గ్రామశివారులో దేవతలకు మొక్కులుతీర్చుకున్నారు. మండలంలోని గ్రామాల్లో రైతులు సంతోషం ఈసందర్భంగా సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

డంపింగ్ యార్డ్ హటావో.. దర్గా బచావో..

-నినాదంతో కాంగ్రెస్ నాయకుల మహాధర్నా

-సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ జిఓ 641 నూ రద్దు చేయాలని డిమాండ్



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నేతలు, వివిధ గ్రామాల ప్రజలు

కేశంపేట, జులై 18, ప్రభాతవార్త:

కొత్తూరు మండలపరిధిలోని సిద్దాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు సంబంధించిన జీవో నెం.641ను తక్షణమే రద్దుచేయాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనుమగల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు, పెద్దలు పాల్గొని డంపింగ్ యార్డ్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా అనుమగల్ల రమేష్ మాట్లాడుతూ జెపిదర్గా పవిత్రతను కాపాడటంతోపాటు పరిసరప్రాంత ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, మత సామరస్యాన్ని రక్షించడమే ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో జెపిదర్గా, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, పెంజర్ల శ్రీఅనంత పద్మనాభస్వామి ఆలయం, సేవాలాల్ మహారాజ్ దేవస్థానం, ఎస్‌టి గురుకులపాఠశాల వంటి పవిత్ర స్థలాలు, విద్యాసంస్థలు కాలుష్యప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. అందువల్ల ప్రభుత్వం ప్రజల మనోభావాలను గౌరవించి, జీవో నెం.641ను వెంటనే రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మహాధర్నాలో కుల, మత, రాజకీయాలకతీతంగా ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని ఉద్యమానికి సంఘీభావం ప్రకటించడం విశేషమన్నారు. మహాధర్నాను విజయవంతంచేసిన ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త, ప్రజాప్రతినిధి, గ్రామపెద్ద, మహిళలు, యువత, ప్రజలకు అనుమగల్ల రమేష్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ కేశంపేట మహిళా అధ్యక్షురాలు గుండె రాణి, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గూడ వీరేశం, మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, తోమిదిరేకుల సర్పంచ్ బిస కవితకరుణాకర్‌రెడ్డి, సర్పంచ్ అకీల్, ఎస్టీసెల్ ప్రెసిడెంట్ రూప్లానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ గిరి యాదవ్, రమణగౌడ్, బిసి సెల్ అధ్యక్షులు రావుల పెంటయ్య, లింగం, యూత్ కాంగ్రెస్ అకీల్, సచిన్, శ్రీకాంత్, మల్లేష్, మనోహర్, నరసింహ రెడ్డి, బాలోజీ, చారి, ప్రకాష్, గోపాల్, నర్సింహ, సుందరయ్య, సురేష్, బిమ్మయ్య, లింగం, కాంగ్రెస్ నాయకులు, అనుబంధవిభాగాల నాయకులు, కార్యకర్తలు, వివిధగ్రామాల ప్రజలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వృక్షసంపద పెంపు మన బాధ్యత

మొక్కలు నాటుతున్న ఎంఈఓ పాండు, కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, జులై 18, ప్రభాతవార్త:

ఉష్ణతాపం, కాలుష్యం బారి నుండి భూమండలానికి రక్షణ కల్పించాలంటే ప్రతిఒక్కరూ బాధ్యతగా వృక్షసంపదను పెంపొందించాలని ఆమనగల్లు మండల విద్యాధికారి పాండు, మున్సిపాలిటి కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి, ఎస్సై కోటేశ్వరరావు అన్నారు. జీవరాశి మనుగడలో మొక్కలు ప్రధాన భూమిక పోషిస్తాయని, ఉద్యమస్ఫూర్తితో మొక్కలునాటి వాటి సంరక్షణను బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలోని అరబిందో స్కూల్లో శనివారం గ్రీన్ డే వేడుకలు నిర్వహించారు. వేడుకలకు అధికారులు పాండు, రాఘవేందర్‌రెడ్డితో ఎస్సై కోటేశ్వరరావు, మున్సిపల్ మేనేజర్ ఆంజనేయులు, ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పాఠశాల కరస్పాండెంట్ నలబోలు సుధీర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ గ్రీన్‌డే పేరిట చిన్నారుల మొక్కలునాటడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో అకాడమిక్ అడ్వయిజర్ ప్రేమకుమారి, ప్రిన్సిపాల్ నాగమణి, ఉపాధ్యాయ బృందం నరేశ్‌నేత, భాస్కర్‌గుప్త, నజీర్, రతీష్, శ్రీను, శేఖర్, రఘు, రాధ, సౌజన్య, సునిత, సౌమ్య, యామిని, శైలజ, ప్రేమలత, సంధ్య, నహేద, సింధు తదితరులు పాల్గొన్నారు.

చలో సరూర్‌నగర్‌కు తరలిన బిఆర్ఎస్ నేతలు

చలో సరూర్‌నగర్ సభకు వెల్తున్న బిఆర్ఎస్ నాయకులు

జిల్లెడు చౌదరిగూడ, జులై 18, ప్రభాతవార్త:

బిఆర్ఎస్ అదిష్ఠానం పిలుపు మేరకు చలో సరూర్‌నగర్ యువ సంగ్రామం సభకు మండల బీఆర్ఎస్ నాయకులు శనివారం తరలివెల్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ మాట్లాడుతూ ఉద్యోగాలు ఇస్తామని మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెపెందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సభా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జిల్లెడు చౌదరిగూడ, జులై 18, ప్రభాతవార్త:

జిల్లెడు చౌదరిగూడ మండలంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నర్సింహులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పలు సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు చేపడుతున్నట్లు, అలాగే విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లనరికివేత పనులు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 8గంటలనుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అధిక ధరలకు అమ్మితే కఠినచర్యలు

-ఎడిఎ శోభారాణి

ఆమనగల్లు, జులై 18, ప్రభాతవార్త:

ఎరువులు, విత్తనాలు, మందులను ఎంఆర్‌పి కంటే అధికధరలకు అమ్మితే ఆదుకాణాలపై కఠినచర్యలు తీసుకుంటామని ఆమనగల్లు డివిజన్ వ్యవసాయ సహాయసంచాలకులు శోభారాణి హెచ్చరించారు. విక్రయించినవాటికి తప్పకుండా బిల్లులు, రికార్డులలో నమోదు చేయాలని ఆమె సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని రైతువేదికలో శనివారం ఎరువుల డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలడీలర్లు హాజరయ్యారు. ఈమేరకు శోభారాణి పలు సూచనలు, సలహాలను అందజేశారు. కార్యక్రమంలో ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల, తలకొండపల్లి మండలాల వ్యవసాయాధికారులు శ్రీనివాస్‌గౌడ్, అరుణకుమారి, కవిత, రేణుకచక్రవర్తి, డీలర్లు తదితరులు ఉన్నారు.

మేడ్చల్ ఎస్సైపై సిపికి ఫిర్యాదు

మేడ్చల్, జులై 18, ప్రభాతవార్త:

సివిల్ తగాదాలో తలదూర్చడమే కాకుండా తమ ప్రత్యర్థులకు వత్తాసు పలికి తనను బెదిరించినందుకు గాను మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లోని సబ్ ఇన్స్పెక్టర్‌పై సైబరాబాద్ పోలీస్‌కమిషనర్‌కు ఫిర్యాదుచేశానని ఎల్లంపేట మున్సిపల్ కేంద్రమైన ఎల్లంపేటగ్రామానికి చెందిన తలారి చందర్ ఓ ప్రకటనలో పేర్కొన్నాడు. ఎల్లంపేట మున్సిపాలిటీ లోని ఎల్లంపేట గ్రామంలో ఓ సివిల్ వివాదాల్లో ఒక వర్గానికి ఏకపక్షంగా డబ్బులకు అమ్ముడుపోయి కోర్టు ఆర్డర్ ఉన్న తనను తన స్థలంలోకి వెళ్ళకూడదని, ఆస్థలాన్ని, అందులో ఉన్న ఇంటిని పడిలిపెట్టమని ఆస్థలాన్ని ప్రత్యర్థివర్గానికి అప్పగించాలని మేడ్చల్ ఎస్ఐ చెప్పారని పేర్కొన్నాడు. అంతేకాకుండా ఆరూమ్ తాళంచెవిని వారికి అప్పగించాలని, స్థలాన్ని వదిలేయకపోతే ఇప్పుడే నీపై కేసు నమోదుచేస్తానని ఈ నెల 17 వ తేదీ రాత్రి 9 గంటల 18 నిమిషాలకు ఫోన్ చేసి ఎస్సై పదేపదే బెదిరించారని చందర్ తెలిపాడు. ఈ విషయంపై మేడ్చల్ ఎస్సై పై సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశానని పేర్కొన్నాడు. కోర్టు ఆర్డర్ తనకు అనుకూలంగా ఉందని, నా వద్ద తీసుకున్న తాళంచెవి తిరిగి తనకు ఇప్పించి, తనను భయ భ్రాంతులకు గురిచేసిన ఎస్ఐపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీపీని కోరినట్లు తెలిపాడు.

నూతన ఎంఈఓకు సన్మానం

ఎంఈఓ సుధాకర్ ను సన్మానిస్తున్న దృశ్యం

బంట్వారం, జులై 18, ప్రభాతవార్త:

బంట్వారం మండల విద్యాధికారిగా బదిలీపై వచ్చిన సుధాకర్‌ను ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యసంఘం సభ్యులు శనివారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, ఈప్రాంతంలో నాణ్యమైన విద్యను అందించాలని, విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పిస్తూ పాఠశాలలు నడిపించాలని సూచించారు. లాభాపేక్షతో కాకుండా సేవాభావంతో విద్య నందించాలని తెలిపారు. వికారాబాద్ జిల్లాలో వెనుకబడిన ప్రాంతంలో మొదటిస్థానంలో ఉన్న బంట్వారం మండలాన్ని ఉన్నతమైనవిద్యను అందించి ముందంజలో నడిపించాలని ప్రైవేట్‌పాఠశాల యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు స్కూల్స్ యాజమాన్య సంఘం సభ్యులు బ్రహ్మం, వెంకటేశం తదితరులు ఉన్నారు.

ప్రజల తరపున కొట్లాడితే తప్పేంటి?

-రాక్షస ముఖ్యమంత్రిని సాగనంపాలి

-పోలీస్‌స్టేషన్ వద్ద రైతుధర్నాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై నిప్పులుచెరిగిన ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, కార్తీక్‌రెడ్డి

పోలీస్ స్టేషన్ ముందు ధర్నా-జనంతో పరిసరాలు

నందిగామ, జులై 18, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్రంలో దొంగలు పడ్డారని, జాగ్రత్త పడకపోతే దోచుకుపోతారని, మళ్లీ మననీళ్లు, నిధులు, నియామకాలు రావాలంటే, బిఆర్ఎస్ అధినేత, కెసిఆర్ ప్రభుత్వం వచ్చేవరకు కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటంచెయ్యాలని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి, శ్రీనివాస్ గౌడ్, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డిలు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులుచెరిగారు. శంషాబాద్‌మండలం బహదూర్‌గూడలో వివాదాస్పద భూవ్యవహారంలో నిరుపేదరైతులకు మద్దతుగా నిలిచిన కార్తీక్‌రెడ్డిని పోలీసులు అరెస్టుచేసి, నందిగామ పోలీస్‌స్టేషన్లో పెట్టడాన్ని నిరసిస్తూ శనివారం పోలీస్‌స్టేషన్ ముందు మహిళారైతుల ఆందోళనలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీ చేసే తప్పులను వ్యతిరేకిస్తూ, ప్రతిపక్షంలో ఉండి ప్రజలతరపున కొట్లాడితే తప్పేంటని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన, విద్యార్థులకిచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారని, బిఆర్ఎస్ చేపట్టిన యువసంగ్రామ సదస్సుకు వెళితే పోలీసులచేత కొట్టించడం దుర్మార్గమన్నారు. బహదూర్‌గూడ వ్యవహారంలో నిరుపేద రైతులకు మద్దతుగా నిలిచిన కార్తీక్‌రెడ్డిని అరెస్టుచేయడం దారుణం అన్నారు. సిద్దాపూర్ డంపింగ్‌యార్డు ఎత్తివేసేవరకు పోరాడుతామన్నారు. మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కొట్లాడి, ప్రాణాలకు తెగించి, రాష్ట్రాన్ని తెచ్చుకున్నామని, బహదూర్‌గూడ భూముల పట్టాలు ఇప్పించేవరకు, సిద్దాపూర్ డంపింగ్‌యార్డ్ ఎత్తివేసేవరకు ప్రజలపక్షాన పోరాడతామన్నారు, రాజేంద్రనగర్ ఇంచార్జ్ కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ రానున్నరోజుల్లో ప్రభుత్వం మనదేనని, అధికారులు, పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తే తగినమూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళనచేస్తున్న మహిళా రైతులు, బిఆర్ఎస్ నేతలతో మాట్లాడి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ ధర్నా విరమింపచేసి శాంతింపచేసి, పాత జాతీయరహదారిపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ధర్నాలో శంషాబాద్ మాజీఎంపిపి చెక్కల ఎల్లయ్య, మాజీ జడ్పిటిసి బూర్‌కుంట సతీష్, మాజీఎఎంసి చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు చింటూ, యుగంధర్, రాజేశ్వర్, దినేష్‌సాగర్, శివచారిసాగర్, తుప్పుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్షాభావ పరిస్థితుల్లో మట్టిసంరక్షణే భరోసా

-జిల్లా రైతులకు వ్యవసాయశాఖ అత్యవసర సూచనలు

రంగారెడ్డి అర్బన్, జులై 18, ప్రభాతవార్త:

వర్షాల అస్థిరత మధ్య మధ్యలో ఏర్పడుతున్న పొడి దశలు నేలలో తేమ తగ్గిపోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో రైతులు మట్టిసంరక్షణ చర్యలకు అత్యంతప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా వ్యవసాయశాఖ సూచించింది. నేల తేమను కాపాడుకోవడం, మట్టి కోతను నివారించడం, భూసారాన్ని పరిరక్షించడం ద్వారా పంటల ఉత్పాదకతను మెరుగుపర్చుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారిణి సుజాత తెలిపారు. నేలతేమను నిల్వ ఉంచేందుకు అవసరానికి మించి దున్నకం నివారించి తక్కువ దున్నకం (మినిమమ్ టిల్లేజ్)లేదా సున్నా దున్నకం (జీరో టిల్లేజ్) పద్ధతులను అనుసరించాలని సూచించారు. విత్తనాలు వేసే ముందు నేలలో తేమను పరిశీలించి సరైన సమయంలోనే విత్తనం వేయాలని, రిడ్జ్ అండ్ ఫరో పద్ధతిలో సాగు చేయడం ద్వారా నీటివినియోగ సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. రైతులు తమ భూమి స్వభావం, వాలు, నీటి లభ్యత, పంట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సమీప వ్యవసాయ విస్తరణ అధికారి లేదా మండల వ్యవసాయ అధికారిని సంప్రతించి సాంకేతిక సూచనలు పొందాలని జిల్లా వ్యవసాయ అధికారిణి సుజాత విజ్ఞప్తిచేశారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి పెద్దపీట

-ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జులై 18, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్రంలో అందరికీ నాణ్యమైన విద్యనందించమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ బడులను బలోపేతం చేసి పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు విద్యను చేరువచేస్తున్నారని ఆయన కొనియాడారు. ఆమనగల్లులోని కస్తూర్బాగాంధి విద్యాలయంలో శనివారం మున్సిపాలిటీ చైర్మన్ పత్యానాయక్‌తో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రభుత్వం సమకూర్చిన నూతన యూనిఫారాలను పంపిణీచేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెరిగిందని చెప్పారు. నియోజకవర్గంలోని పలుగ్రామాల్లోని ప్రభుత్వపాఠశాల్లో ప్రవేశాలు పెరగడం అందుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని ఎమ్మెల్యే నిర్వాహకులను ఆదేశించారు. అంతకుముందు పాఠశాల ప్రిన్సిపాల్ గీత ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు మొక్కలు అందజేసి, విద్యార్థులు కోలాటం ఆటతో స్వాగతంపలికి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అధికారులు ఎంఈఓ పాండు, మున్సిపాలిటీ కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ యాటగీతనర్సింహ్మా, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మండలపార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, గుర్రం కేశవులు, జగన్, వస్పుల మానయ్య, కృష్ణనాయక్, వస్పుల శ్రీశైలం, ఫరీద్, వస్పుల శ్రీకాంత్, మెకానిక్‌బాబు, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షులుగా బాలక్రిష్ణ

దోమ. జులై 18, ప్రభాతవార్త:

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేస్తానని వికారాబాద్‌జిల్లా తెలంగాణ ఉద్యమకారుల సంఘం నూతన అధ్యక్షులుగా నియమితులైన బల్ల బాలక్రిష్ణయాదవ్ తెలిపారు. శనివారం రాష్ట్ర కమిటి అధ్యక్షులు పూసశ్రీనివాస్ చేతులమీదుగా వికారాబాద్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షులుగా బల్ల బాలక్రిష్ణయాదవ్ నియామకపత్రం అందుకున్నారు.ఈ సందర్భముగ ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం కోసం నిరంతరంగా పని చేసిన ఉద్యమ కారులకు తగిన న్యాయం గౌవరం కోసం డిమాండ్ల సాదన కోసం కృషి చేస్తానని హామి ఇచ్చారు.వికారాబాద్ జిల్లాలోని అన్ని వర్గాల ఉద్యమ కారులతో కలుపుకొని ముందుకు పోయి సంఘం బలోపేతానికి ప్రయత్నిస్తానని తెలిపారు.ఉద్యమకారులకు త్వరలో గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుందని ప్రభుత్వం పరంగా అబివృద్ధి కార్యక్రమాలు పథకాలు అమలుచేస్తె ఉద్యమకారులకు తగిన ప్రాదాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. వికారాబాద్ జిల్లా అధ్యక్షులుగా నియమించినందున కమిటిసభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

జీవాలకు పిపిఆర్ వ్యాక్సినేషన్ తప్పనిసరి..

-మండల పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

మొయినాబాద్, జులై 18, ప్రభాతవార్త:

గొర్రెలు, మేకలకు వచ్చే పారుడువ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న పిపిఆర్‌వ్యాక్సిన్‌ను పెంపకందారులు తప్పక వేయించాలని మొయినాబాద్ మండల పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. శనివారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్ నగర్ గ్రామంలోని 350 గొర్రెలు, మేకలకు పిపిఆర్ వ్యాక్సినేషన్ వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. పారుడు వ్యాధి ఒ వైరస్ వల్ల వస్తుందని, ఈ వ్యాధిరావడంతో జీవాల్లో జీర్ణ, శ్వాస, నాడీవ్యవస్థ దెబ్బతింటుందన్